బీహెచ్‌ఈఎల్ బీవీబీ విద్యార్థుల జాతీయ స్థాయిలో ప్రతిభ



సాక్షి, హైదరాబాద్ : బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని భారతీయ విద్యాభవన్ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో మెరిశారు. చెన్నైకి చెందిన 'విశ్వాస్ చారిటబుల్ ట్రస్ట్' నిర్వహించిన జాతీయ స్థాయి విష్ణు సహస్రనామ పఠన పోటీ, చిత్రలేఖనంలో జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల సంస్కృత అధ్యాపకురాలు జగన్మోహిని నేతృత్వంలో విద్యార్థులు శ్రేయస్ ముకుంద్, షణ్ముఖ సాత్విక్, వార్షిక విష్ణు సహస్రనామ వార్షిక పఠన పోటీలో ద్వితీయ స్థానంలో నిలవగా.. చిత్రలేఖనంలో విజువల్ ఆర్ట్ ఉపాధ్యాయులు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో మహితీ క్షీరసాగర్, సంజుక్త బెనర్జీ ప్రథమ స్థానంలో, మీనాక్షి ద్వితీయ, దేబవర్ధ మాండల్ తృతీయ స్థానంలో నిలిచారు. వారికి పాఠశాల ప్రిన్సిపాల్ చేబోలు ఉమా, వైస్ ప్రిన్సిపాల్ వాణి అభినందనలు తెలిపారు.

సంక్రాంతి రంగోలి పోటీలు షురూ



రాయదుర్గం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని రంగోలి పోటీలు ఆరంభమయ్యాయి. కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో గురువారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కామిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రంగోలి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కన్వీనర్ టీ. రామస్వామియాదవ్ మాట్లాడుతూ.. ఆరోగ్యాన్ని, పారిశుద్ధ్యాన్ని, విజ్ఞానాన్ని మేళవించే సనాతన సాంప్రదాయమే ఇంటి ముందు ముగ్గులు వేయటమని పేర్కొన్నారు. ప్రతి యేటా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈసారి 30 కాలనీలలో రంగోలి పోటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం పోటీలలో విజేతలకు 8వ బెటాలియన్ రిజర్వ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాస్ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వాణి సాంబశివరావు, తన్వీర్ బేగం, బెటాలియన్ మహిళలు పాల్గొన్నారు.



కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో రంగోలి పోటీలలో పాల్గొన్న మహిళలు

విద్యుత్ సమస్యలపై కార్పొరేటర్ సమీక్షా సమావేశం

శేరిలింగంపల్లి: ఆదర్శనగర్‌లో విద్యుత్ సమస్యలపై ఆ విభాగం అధికారులతో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోపీనగర్, నెహ్రూనగర్, బాపూనగర్, ప్రశాంత్‌నగర్, ఆదర్శనగర్‌లలో శిథిలావస్థకు చేరిన ఎలక్ట్రికల్ పోల్స్‌ను మార్చాలని సూచించారు. అదే విధంగా బస్తీల్లో నూతనంగా వేసిన రోడ్లలలో ఎలక్ట్రికల్ పోల్స్ ఇబ్బందిగా మారాయని, కొన్ని ప్రాంతాల్లో ఇళ్లపై నుంచి ఎలక్ట్రికల్ వైర్స్ వెళ్తున్నాయని, వాటిని పరిశీలించిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయా బస్తీల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో డీఈ గోపాలకృష్ణ, ఏడీఈ రాంబాబు, ఏఈ వెంకట నారాయణరెడ్డి, సబ్ ఇంజినీర్ కిషోర్, బీఆర్ఎస్ నాయకులు వీరేశంగౌడ్, గోపాల్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ సోందాస్, ఆదర్శనగర్ కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నైపుణ్యాన్ని వెలికితీయడమే 'సృజన టెక్‌ఫెస్ట్' లక్ష్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ఎస్ ఎక్బాల్‌హుస్సేన్

రాయదుర్గం: విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వం సృజన టెక్‌ఫెస్ట్ ఏర్పాటు చేసిందని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ ప్రిన్సిపల్ ఎస్ ఎక్బాల్ హుస్సేన్ పేర్కొన్నారు. రాయదుర్గంలోని జీఐఎల్‌టీ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం సృజన టెక్‌ఫెస్ట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ నైపుణ్యంతో రూపొందించి ప్రాజెక్టు లక్ష్యాలను వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇన్‌స్టిట్యూట్ స్థాయిలో పోటీలను ఏర్పాటు చేసి ఇందులో అత్యుత్తమ ప్రాజెక్టులను గుర్తించి వాటిని రాష్ట్ర స్థాయి సృజన టెక్‌ఫెస్ట్‌లో ప్రదర్శించేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. రంగారెడ్డి జిల్లా స్థాయిలో జీఐఎల్‌టీ నుంచి రెండు ప్రాజెక్టులను ఎంపిక చేయడం జరిగిందని వాటిని రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలను జనవరి 2024 మొదటి వారంలో ఏర్పాటు చేస్తారన్నారు. జీఐఎల్‌టీ నుంచి ప్రదర్శించిన ప్రాజెక్టులలో జిల్లా స్థాయిలో మొదటిస్థానంలో 'రిప్లేసబుల్ ప్లగ్ సిస్టమ్-స్మార్ట్ ఆర్థోపెడిక్ ఫుట్‌వేర్ ఫర్ పీస్ కేవస్ స్వాలోన్‌ఫీట్, డయాబెటీస్, బర్న్స్, ఆర్థిరిటీస్'పేరిట రూపొందించిన ప్రాజెక్టు మొదటిస్థానంలో నిలువడం విశేషం. ఈ కార్యక్రమంలో జీఐఎల్‌టీ ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

పటాన్‌చెరు టౌన్: తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడి నగదు, బంగారం ఎత్తుకెళ్లిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు చైతన్యనగర్ కాలనీకి చెందిన పెయింటర్ లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం తెల్లాపూర్‌లో ఉండే అత్తగారింటికి వెళ్లి, గురువారం ఉదయం ఇంటికొచ్చాడు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 10 తులాల బంగారం,10 తులాల వెండి, రూ. 10 వేల నగదును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇంటిముందు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నట్లుగా సీసీ ఫుటేజీలో రికార్డు అయ్యింది. బాధితుడు లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పటాన్‌చెరులో చిందరవందరగా వస్తువులు

రూ.75 వేల నగదు, బంగారం అపహరణ

జోగిపేట (అందోల్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చొరబడి నగదు, బంగారం చోరీ చేసిన ఘటన అందోల్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అందోల్‌కు చెందిన కాటిఘర్ సుభాష్ తన కొడుకు అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చిక్సిత చేయిస్తూ అక్కడే ఉన్నాడు. బుధవారం రాత్రి సుభాష్ ఇంటి తాళాలను గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి బీరువాలోని రూ. 75 వేల నగదు, రెండున్నర తులాల బంగారం, రెండు వెండి ప్లేట్లు ఎత్తుకెళ్లారు. ఇంటికి ఉన్న సీసీ కెమెరాలను పగులగొట్టి, సీసీ ఫుటేజీ యూనిట్‌ను తీసుకెళ్లారు. గురువారం ఇంటికొచ్చిన సుభాష్ తాళాలు పగులగొట్టి ఉండడాన్ని చూసి జోగిపేట పోలీసులకు సమాచారాన్ని అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భళా.. ఆల్ ఇండియా క్రాఫ్ట్ మేళా





- వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత హస్త కళా ఉత్పత్తులు
- ప్రతి రోజు ఆంఫీ థియేటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు
- ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగింపు



శిల్పారామంలో మట్‌కి నృత్యాలు

మాదాపూర్: చేనేత హస్తకళా ఉత్పత్తులను కొలుగోలు చేసే వారికి శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా క్రాఫ్ట్ మేళా అందుబాటులో ఉంది. ఈనెల 31వ తేదీ వరకు నిర్వహించనున్న మేళాలో వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. డెవలప్‌మెంట్ ఆఫ్ కమిషనర్ హాండ్లూమ్స్, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు సందర్శకులను ఆకట్టుకునేందుకు అంఫీ థియేటర్‌లో సాయంత్రం 5.30 గంటలకు వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తున్నారు.

మగువలు మెచ్చే దుస్తులు..

కశ్మీర్, కర్ణాటక, గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, వెస్ట్‌బెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.జ్యూట్, టెర్రకోట, హ్యాండిక్రాఫ్ట్ ఉత్పత్తులు ఆకట్టుకుంటున్నాయి. గృహాలంకరణ ఉత్పత్తులు, అనంతపూర్ తోలు బొమ్మలు, కోట, పోచంపల్లి, పటోళ్ళ సారీస్, మహేశ్వరం తస్సార్, మస్లీన్, జాందానీ, బెంగుళూరు సిల్క్ అందుబాటులో ఉన్నాయి. గుజరాత్ బాందీని, కశ్మీరీ సిల్క్ చీరలు, రజాయి, బెడ్‌షీట్స్, బ్లాక్ ప్రింటింగ్ డ్రెస్ మెటీరియల్స్, చీరలు, టెర్రకోట కుండలు, డ్రై ఫ్లవర్స్, మట్టి బొమ్మలు, పూల కుండీలు, లక్నో చికంకారి డ్రెస్సులు మేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు..

సందర్శకులను ఆకట్టుకునేందుకు ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ తంజాపూర్ కర్ణాటక, మధ్యప్రదేశ్ జానపద నృత్యాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సి, సంగీత కచేరీలను సాయంత్రం 5.30 గంటలకు అంఫీ థియోటర్‌లో నిర్వహిస్తున్నారు. మధ్యప్రదేశ్‌కి చెందిన ఉజ్జాయిన్ మట్‌కి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంటున్నాయి.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మాదాపూర్: మాదాపూర్ అయ్యప్పసొసైటీలో గురువారం మూడో రోజు అక్రమ కట్టడాలను అధికారులు కూల్చివేశారు. గుర్తించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని అధికారులు తెలిపారు. కూల్చిన తర్వాత కూడా మళ్లీ నిర్మాణాలను చేపట్టవద్దని హెచ్చరించారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కూల్చివేతలలో ఏసీపీ రాజ్‌కుమార్, చైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 కబడ్డీ పోటీల్లో లక్ష్మణ్, అండర్-15లో అరుణ్, అండర్-17 టెన్నిస్ పోటీల్లో విక్రం సింగ్, అభిషేక్, విక్రం ప్రతిభ చాటారు. దీంతో శుక్రవారం నుంచి హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

ది చెన్నై సిల్క్స్‌లో శారీ మేళా

మూసాపేట: కూకట్‌పల్లి వైజంక్షన్ వద్ద ది చెన్నై సిల్క్స్‌లో గురువారం వరల్డ్ శారీ డే సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శారీ మేళాను ప్రారంభించారు. సరికొత్త డిజైన్స్ అందుబాటులోఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంఆర్ మహేష్, మేనేజర్‌లు త్యాగరాజన్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతిని అవమానించడం సిగ్గుచేటు

మాధవరం కాంతరావు

కూకట్‌పల్లి: పార్లమెంటు సమావేశాల్లో సస్పెండ్ అయిన ప్రతిపక్ష ఎంపీలలో ఒకరైన బెనర్జీ రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌ను ఎగతాళి చేస్తున్న దృశ్యాలను రాహుల్ గాంధీ తన మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ చేయడానికి ఖండిస్తున్నామని కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతరావు అన్నారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం ఎదుట అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీరుకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రతిపక్ష పార్టీల చర్యలు ముఖ్యంగా టీఎంసీ, కాంగ్రెస్ పార్టీల తీరు యావత్ దేశం సిగ్గుపడేలా చేసిందని అన్నారు. ఉపరాష్ట్రపతిని అవహేళన చేయటం, అవమానించటం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి తగదన్నారు. టీఎంసీ, కాంగ్రెస్ పార్టీల ఎంపీలు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనలో కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, నాయకులు శ్రీకర్‌రావు, సూర్యప్రకాష్‌రావు, సురేందర్‌రెడ్డి, మనోహర్, రవికుమార్ గౌడ్, సత్యమూర్తి, వినోద్ కుమార్‌గౌడ్, వినోద్ శ్రీనివాస్, మల్లేష్, సుగుణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని జయశంకర్ కాలనీలోని బస్తీ దవాఖానాను గురువారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడి రోగులకు అందిస్తున్న చికిత్సల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానం ఉంటే వెంటనే టెస్టులు చేయించుకొని వైద్యుల సలహా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ముురుగుతో జనం బేజారు

- దుర్వాసన వెదజల్లుతున్న పరిసరాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- మురుగునీటిని తొలగించాలని విన్నపం



రోడ్డుపై చేరిన మురుగునీరు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శేరిలింగంపల్లి పరిధిలోని నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ వెళ్లే మార్గంలోని తెల్లాపూర్ ముఖద్వారం వద్ద కొన్ని రోజులుగా రోడ్డుపై డ్రైనేజీ నీరు చేరడంతో ప్రజలు రోడ్డును ఆనుకోని ఉన్న వ్యాపారస్తులు మురుగునీటితో దుర్వాసనతో నరకయాతన పడుతున్నారు. నల్లగండ్ల పరిధిలోని పలు కాలనీలకు చెందిన డ్రైనేజీ నీరు కొంతకాలంగా తెల్లాపూర్‌లోని వనం చెరువులోకి చేరుతోంది. కాగా కొంతకాలం క్రితం గత ప్రభుత్వం ఈ మార్గంలో రేడియల్ రోడ్డును అభివృద్ధి చేసింది. దీంతో రేడియల్ రోడ్డును ఆనుకొని వర్షపు నీరు వెళ్లేందుకు కాలువను నిర్మించారు. అయితే ప్రస్తుతం ఆ కాలువలో మురుగునీరు ప్రవహిస్తోంది. అదేవిధంగా గతంలో రోడ్డు అనుకొని ఖాళీ స్థలాలు ఉండేవి. దీంతో మురుగునీరు ఆ ఖాళీ స్థలాల నుంచి చెరువులోకి చేరేవి. ప్రస్తుతం అందులో నిర్మాణాలు చేపట్టడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

రోడ్డుపైకి మురుగునీరు రావడానికి కారణం ఎవరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు అభివృద్ధి చేసినప్పుడు రోడ్డు పక్కన నిర్మించిన కాలువ మూసివేయడం వల్లనే ఈ సమస్య తలెత్తుతోందని స్థానికులు అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు వర్షంనీరు వెళ్లే కాలువను ఎందుకు పూర్తి చేయలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా ఇతర ప్రాంతాలకు చెందిన మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి



కొన్ని రోజులుగా రోడ్డుపైకి మురుగు నీరు వచ్చి చేరుతోంది. దీంతో మా వ్యాపారాలు కూడా సరిగా జరగడంలేదు. నిత్యం అధికారులు ఈ మార్గంలో రాకపోకల సాగిస్తున్నా సమస్యను మాత్రం పరిష్కరించడం లేదు.

– రవీందర్‌రెడ్డి, వ్యాపారి, తెల్లాపూర్

మురుగును తొలగించాలి



తెల్లాపూర్ ముఖద్వారం వద్ద మరుగునీరు ఉండడంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. బ్యాంకు ముందు మురుగునీరు నిలవడంతో బ్యాంకులోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలి.

– నాగరాజ్‌గౌడ్, ప్రైవేట్ ఉద్యోగి

అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా క్రాఫ్ట్ మేళా సందర్శకులను ఆకట్టుకుంటుంది. చేనేత హస్తకళా కారులు తయారు చేసిన ఉత్పత్తులను నగరవాసులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. గురువారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నాట్యగురువు డాక్టర్ రమాదేవి శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శనను ప్రదర్శించి అలరించారు. ఇందులో గణేశస్తుతి, శివాష్టకం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు డాక్టర్ అదిరే, సౌమ్యరామస్వామి, కృతిక ప్రియ, ధృతి, శ్రేయ, శ్లోకలు పాల్గొన్నారు. కూచిపూడి కళామిత్ర అమ్రిత శ్రిల్ శిష్యబృందంచే కళాకారులు అలరించారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు అందించేందుకు కృషి



జగదీశ్వర్ గౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

శేరిలింగంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు అందించేందుకు కృషి చేస్తానని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. నల్లగండ్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఎల్లమ్మ బండ తదితర బస్తీల నుంచి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు ఆయనను కలిసి, పూల బోకే అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ..ప్రజలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఉర్రూతలూగించిన 'థ్యాంక్స్ గివింగ్'



సాక్షి, సిటీబ్యూరో: కార్పొరేట్ ఉద్యోగులు ఆవిష్కరించిన కళలు ఆకట్టుకున్నాయి. కేరింతలు, హర్షధ్వానాలను అందుకున్నాయి. నగరానికి చెందిన ఆర్థిక సేవల సంస్థ సింక్రనీ.. గండిపేటలోని ఆహ్వానం రిసార్ట్స్‌లో నిర్వహించిన 'థ్యాంక్స్ గివింగ్ టౌన్ హాల్'ఈవెంట్ ఉర్రూతలూగించింది. బాలీవుడ్ గాయని షల్మాలీ కోల్గాడే, రాక్ బ్యాండ్ రాజమటాజ్, మార్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత, నృత్య, క్రీడలు సందడి చేశాయి. వేలాది మంది ఉద్యోగులు పాల్గొన్నారు. సంస్థ వైస్ ప్రెసిడెంట వాటికా కౌరా ఈవెంట్‌ని పర్యవేక్షించారు.

వచ్చే నెల 28న దుర్గం చెరువు రన్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో పేరొందిన మారథాన్‌లలో ఒకటైన ఇనార్బిట్ దుర్గం చెరువు రన్ (ఐడీసీఆర్)లో పాల్గొనేందుకు పేర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ విషయాన్ని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 28న జరుగనున్న ఈ రన్ ద్వారా సేకరించిన నిధులను దివ్యాంగుల, నిరుపేద ఆడపిల్లల విద్యాభ్యాసం.. వంటి సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నామని, నిర్మాణ్ తదితర ఎన్‌జీఓల భాగస్వామ్యంతో నిర్వహించే ఈ రన్‌ను దివ్యాంగులే జెండా ఊపి ప్రారంభించనున్నారని వివరించారు. ఈ రన్ ఇనార్బిట్ మాల్ దగ్గర ప్రారంభమై మైండ్‌స్పేస్‌లోని బిజినెస్ పార్క్ దగ్గర ముగుస్తుందన్నారు.

నేడు కల్యాణ మండపానికి భూమిపూజ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్ -2లోని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో శుక్రవారం స్వామివారి కల్యాణ మండపానికి భూమిపూజ చేయనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామల భాస్కర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆలిండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జి.సంజీవరెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొననున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భూమిపూజ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రి సమస్యలను పరిష్కరిస్తా



పర్వత్‌నగర్‌లోని పీహెచ్‌సీని సందర్శిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్‌లోని ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కార్పొరేటర్ సబిహా బేగం గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిలో పలు సమస్యలపై డ్యూటీ వైద్యులు విజయచంద్రను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ప్లంబింగ్ వర్క్, వార్డులో విద్యుత్ దీపాలు వెలగకపోవటం వంటి సమస్యలు ఉన్నాయని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలన్నిటికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, ఆశావర్కర్లు, కోఆర్డినేటర్ వీరారెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షులు జాహెద్ షరీఫ్ బాబా, రాజు, శ్రీనివాస్‌యాదవ్, గంగపుత్ర శంకర్, రాములు యాదవ్, బ్రహ్మం, వెంకటమ్మ, రేవతి, లక్ష్మీ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవంతినగర్ ఈస్ట్ కాలనీ సమస్యలను పరిష్కరించండి

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ ఈస్ట్ కాలనీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని మూసాపేట డీసీ రమేష్‌కు గురువారం సంక్షేమ సంఘం అధ్యక్షుడు లయన్ అన్నెం కోటిరెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు పెరిగి పెద్దవై విద్యుత్ వైర్లకు తగలటంతో తరచూ షార్ట్ సర్క్యూట్ అవుతోందన్నారు.

◆ చెట్లు పెద్దవి కావటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైందని తెలిపారు. అదే విధంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా డీసీ స్పందిస్తూ ఆయా సంబంధిత శాఖ అధికారులతో ప్రణాళిక వేయించి నిధులు మంజూరు అయిన వెంటనే పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో ప్రధాన కార్యదర్శి టి. దేవేందర్‌రావు, సభ్యులు ఎల్లంబరెడ్డి, పి. మల్లయ్య, సీహెచ్. రామచందర్, బుద్ధబాబు తదితరులు పాల్గొన్నారు.